క్లుప్తంగా

రేపు ఉచిత వైద్య శిబిరం

రాజుపాళెం : రాజుపాళెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీరాణి శుక్రవారం తెలిపారు. ఈ వైద్య శిబిరంలో 8 మంది వైద్యులు పాల్గొంటారని, రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు. ఈ శిబిరంలోఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ రాంప్రసాద్ రెడ్డి, బ్యాంకు అధికారులు, చైర్మన్లు పాల్గొంటారని వివరించారు.

కడపలో 23న 'జింకా'పై సాహిత్య సదస్సు

ప్రొద్దుటూరు కల్చరల్ : కడప సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఈనెల 23న ఉదయం 10 గంటలకు సాహిత్య సదస్సు నిర్వహించనున్నట్లు వైవీయూ సభ్య కార్యదర్శి కుల సచివులు ఆచార్య వైపీ వెంకటసుబ్బయ్య తెలిపారు. నెలనెల సీమ సాహిత్యం కార్యక్రమంలో భాగంగా జింకా సుబ్రహ్మణ్యం జీవితం – సాహిత్యం అనే అంశంపై ప్రొద్దుటూరుకు చెందిన ఉపాధ్యాయుడు కొత్తపల్లె శీను ప్రసంగించనున్నారు.

23న టెట్, డీఎస్సీపై ఉచిత అవగాహన సదస్సు

ప్రొద్దుటూరు కల్చరల్ : రాష్ట్ర ప్రభుత్వం త్వరలో విడుదల చేయనున్న టెట్, డీఎస్సీ నోటిఫికేషన్లపై విద్యార్థులకు ఉచిత అవగాహన సదస్సు ఆదివారం ఉదయం 9 గంటలకు స్థానిక సృజన్స్ కోచింగ్ సెంటర్‌లో నిర్వహిస్తున్నట్లు సెంటర్ డైరెక్టర్ కె.సృజన్ తెలిపారు. ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ల పరీక్షల నమూనా, డీఎస్సీ తరహాలో టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తామన్నారు. టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభకనబరిచిన వారికి ప్రథమ బహుమతి రూ.3వేలు, ద్వితీయ బహుమతి రూ.1500 అందిస్తామన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని, డీఎస్సీ అభ్యర్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు సెల్ నంబర్ 80999 19877కు సంప్రదించాలని కోరారు.

నేటి నుంచి 'ఉపాధి' గ్రామ సభలు

చాపాడు : ఉపాధి హామీ పనుల తనిఖీపై ఈ నెల 22 నుంచి 24 వరకు ఆయా పంచాయతీలలో గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఉపాధి హామీ పథకం ఏపీఓ పద్మారాణి తెలిపారు. 22న అల్లాడుపల్లె, 23న పల్లవోలు, సీతారామాపురం, నాగులపల్లె, చియ్యపాడు, సోమాపురం, 24న వెదురూరు, లక్ష్మీపేట, ఎస్.ఓబాయపల్లె, ఖాదర్‌పల్లె, చాపాడు, మడూరు, టీఓపల్లె, అన్నవరం, కుచ్చుపాప, పెద్దగురువళూరు, సిద్దారెడ్డిపల్లె, చిన్నగురువళూరు, అయ్యవారిపల్లె, రాజువారిపేట, బద్రిపల్లె, విశ్వనాథపురం గ్రామాలలో గ్రామ సభలు నిర్వహిస్తామని ఉపాధి కూలీలు, ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలు పాల్గొనాలని ఏపీఓ తెలిపారు.

చీరలు, దుప్పట్లు పంపిణీ

పోరుమామిళ్ల : మండలంలోని అక్కలరెడ్డిపల్లె ఎస్టీకాలనీ వాసులకు శుక్రవారం సంజీవని ఫ్యూచర్ హెల్ప్ చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ ప్రాంతంలో అనాథ పిల్లలు, వృద్ధులు ఉంటే మాకు సమాచారం ఇస్తే వారికి ఆశ్రయం కల్పిస్తామన్నారు. వివరాలకు 9535297971 నెంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న ఏడీఏ డీవీ రమణారెడ్డి

దువ్వూరు : మండల కేంద్రంలోని ఎరువుల, పురుగుల మందుల దుకాణాలను శుక్రవారం వ్యవసాయ శాఖ ఏడీఏ డీవీ రమణారెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలను పురుగుల మందులను విక్రయించాలని దుకాణాదారులకు సూచించారు. నకిలీ విత్తనాలు, మందులను రైతులకు విక్రయిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వం ఆమోదించిన బయో మందులను రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులను అమ్మాలన్నారు. స్టాక్, అమ్మకాల రిజిస్టార్లను పరిశీలించారు. ఏఓలు పద్మజ, అమరనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యాన్ని నిర్ణయించుకోవాలి



కెరీర్ గైడెన్స్ పుస్తకాలు అందిస్తున్న హెచ్‌ఎం

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులు ఒక లక్ష్యాన్ని నిర్ణయించుకోవాలని వివేకానంద ఫౌండేషన్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు పాపిజెన్ని రామకృష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని దొరసానిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వివేకానంద ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం పదో తరగతి చదువుతున్న 150 మంది విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కొండారెడ్డి, సంస్థ ప్రతినిధి టి.వెంకట సురేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష' సద్వినియోగం చేసుకోండి



ప్రొద్దుటూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



మైదుకూరు: సర్టిఫికెట్‌ను అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



జగనన్న సురక్ష కార్యక్రమంలో లబ్ధిదారులకు ధృవీకరణపత్రాలు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా గ్రామ, వార్డు సచివాలయాల్లోనే రేషన్ కార్డులు తయారు చేసి ప్రజలకు ఇస్తున్నారని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 43, 44 వార్డు సచివాలయాల పరిధిలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాచమల్లు మాట్లాడుతూ గతంలో రేషన్ కార్డు రావాలంటే విజయవాడలో ప్రింట్ అయ్యేదన్నారు. ప్రస్తుతం ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని దరఖాస్తు చేసుకున్న వెంటనే అర్హులకు రేషన్‌కార్డులు మంజూరు చేస్తున్నామని తెలిపారు. అదే తరహాలో కొడుకు ఉద్యోగంలో ఉంటే తల్లిదండ్రులను రేషన్ కార్డు నుంచి వేరుచేసే అవకాశం వచ్చిందని ఎమ్మెల్యే తెలిపారు. తద్వారా వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులకు రేషన్ కార్డుతోపాటు పింఛన్ కూడా వచ్చే అవకాశం ఉందన్నారు. అనంతరం ఎమ్మెల్యే లబ్ధిదారులకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, 40వ వార్డు కౌన్సిలర్ రావులకొల్లు అరుణ నాగేంద్ర, 41వ వార్డు కౌన్సిలర్ గంజికుంట రామసుబ్బమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు గంజికుంట ఆంజనేయులు, పద్మశాలీయ సంఘం పట్టణాధ్యక్షుడు అగ్గారపు శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య పాల్గొన్నారు.

ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు

చాపాడు : జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల ముంగిటకే ఉచితంగా ప్రభుత్వ సేవలు అందిస్తున్నారని ఎంపీపీ తెలిదేల లక్షుమయ్య పేర్కొన్నారు. మండలంలోని సోమాపురం గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం జగనన్న సురక్ష గ్రామసభ నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ జగనన్న సురక్ష ద్వారా గ్రామ వలంటీర్లు ప్రజల ఇళ్ల వద్దకు వెళ్లి వారికి కావాల్సిన అన్ని రకాలైన ధృవీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేయించి ఉచితంగా అందిస్తామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబానికి అందుతున్నాయని దీని కోసం అర్హత ఉంటే చాలన్నారు. అనంతరం 634 మందికి వివిధ రకాల ధృవీకరణ పత్రాలను పంపిణీ చేశారు. మండల ప్రత్యేకాధికారి సురేష్‌రెడ్డి, తహసీల్దారు సుభానీ, ఇన్‌ఛార్జ్ ఎంపీడీఓ రాధాకృష్ణవేణి, సర్పంచ్ శ్రీనివాసులరెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ రామోహన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి పద్మావతి, వైఎస్సార్‌సీపీ నాయకులు హజరత్‌రెడ్డి, వీరారెడ్డి, రామాంజనేయరెడ్డి, సుబ్బరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు వరం జగనన్న సురక్ష

మైదుకూరు : ప్రభుత్వ పథకాల లబ్ధి పొందే అర్హులకు జగనన్న సురక్ష కార్యక్రమం ఒక వరమని తిప్పిరెడ్డిపల్లె సర్పంచ్ బండి నాగేంద్ర బాబు అన్నారు. శుక్రవారం మండలంలోని ఆదిరెడ్డిపల్లె వద్ద గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించి సచివాలయ పరిధిలోని ఆదిరెడ్డిపల్లె, తిప్పిరెడ్డిపల్లె పంచాయతీలకు చెందిన 1250 మందికి సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. తహసీల్దార్ అనురాధ, ఎంపీడీఓ ఏవీ రమణారెడ్డి, పంచాయతీ రాజ్ ఏఈ మధుసూదన్ బాబు, ఉపాధి హామీ పథకం ఏపీఓ లక్ష్మీనారాయణ, ఆదిరెడ్డిపల్లె సర్పంచ్ లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

బద్వేలులో..

బద్వేలు అర్బన్ : మున్సిపాలిటీ పరిధిలోని వెంకటయ్యనగర్, బావనారాయణనగర్ సచివాలయాలకు సంబంధించి పాత మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. అనంతరం లబ్ధిదారులకు ధృవీకరణపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ రాగిమానురవితేజ, వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ కన్వీనర్ యద్దారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పుత్తాలక్ష్మీదేవి, వార్డు ఇన్‌చార్జి రాగిమాను ప్రతాప్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి, డిప్యూటీ తహసీల్దారు లీలావతి, గృహసారథులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

కలసపాడులో..

కలసపాడు : మండలంలోని పిడుగుపల్లె సచివాలయంలో శుక్రవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో జడ్పీటీసీ అంకన గురివిరెడ్డి పాల్గొని 501 మందికి పత్రాలు అవసరం కాగా 472 మందికి అందజేశామని, మిగిలిన వారికి త్వరలోఅందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి మురళీధర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సూదా రామక్రిష్ణారెడ్డి, సుదర్శన్, నారాయణయాదవ్, చిత్తా రాజశేఖర్‌రెడ్డి, విజయబాస్కర్‌రెడ్డి, పురుషోత్తం రెడ్డి, సింగరయ్య, పిడుగుపల్లె, పెండ్లిమర్రి సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి



ధర్నా చేస్తున్న మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులు

మైదుకూరు : సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మైదుకూరు మున్సిపాలిటీలోని ఉద్యోగులు, కార్మికులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. సీఐటీయూ అనుబంధ మున్సిపల్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నా సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ కార్మికులు ఏళ్ల తరబడి ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు కోరారు. యూనియన్ కార్యదర్శి ఓబులేసు, కోశాధికారి చిన్న మద్దతు తెలుపగా, ధర్నాలో పుల్లమ్మ, పాపారాయుడు, సుబ్బమ్మ, ఓబులమ్మ, నాగరాజు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు : మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ పట్టణ ప్రధాన కార్యదర్శి సాల్‌మోన్, గౌరవాధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న నెల రోజుల హెల్త్ అలవెన్స్ ఇవ్వాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్యకు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ పట్టణ అధ్యక్షుడు చంటి, రాష్ట్ర కమిటీ సభ్యుడు విజయకుమార్, పట్టణ కోశాధికారి రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బాలికల శాతం పెంచేందుకు కృషి చేద్దాం



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ చంద్రహాసరెడ్డి

బద్వేలు అర్బన్ : బాలికల సంఖ్య పెంచేందుకు వైద్య సిబ్బంది కృషి చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ చంద్రహాసరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కోటవీధి బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఆడపిల్లను రక్షిద్దాం–ఆడపిల్లను చదివిద్దాం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టం (పీసీపీఎన్‌డీటీ)పై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సౌమ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, కె.వెంకట్రామిరెడ్డి,హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, ఎంపీహెచ్‌ఓ టి.నరసింహారెడ్డి, హెల్త్ అసిస్టెంట్ జనార్దన్, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజన్న భోజనశాలలో భోజనం వడ్డించిన ఎమ్మెల్యే



భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు

ప్రొద్దుటూరు : స్థానిక రాచమల్లు వారి రాజన్న భోజన శాలలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి శుక్రవారం మధ్యాహ్నం పేదలకు భోజనం పెట్టారు. మంత్రులు తానేటి వనిత, ఆదిమూలపు సురేష్ చేతుల మీదుగా గురువారం ఎమ్మెల్యే భోజనశాలను ప్రారంభించిన విషయం తెలిసిందే. పేదలకు ఉచితంగా భోజనం పెడుతున్నందుకు ఆయనకు పలువురు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ వరికూటి ఓబుళరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి పగిడాల దస్తగిరి, ఎమ్మార్పీఎస్ సుధాకర్, ప్రొద్దుటూరు, రాజుపాళెం మండలాల వైఎస్సార్‌సీపీ కన్వీనర్లు మార్తల ఓబుళరెడ్డి, గుద్దేటి రాజారాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

23న ప్రొద్దుటూరులో బీజేపీ జోనల్ సమావేశం

ప్రొద్దుటూరు క్రైం : ఈ నెల 23న ప్రొద్దుటూరులో బీజేపీ రాయలసీమ జోనల్ సమావేశం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జోనల్ ఇన్‌చార్జి బిట్రా శివనారాయణ తెలిపారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్టీ నూతన అధ్యక్షురాలుగా బాధ్యతలు చేపట్టిన పురందేశ్వరి రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తున్నారని.. ఇందులో భాగంగా రాయలసీమ జోనల్ పరిధిలో ఉన్న ప్రొద్దుటూరులో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్థానిక రాయల్ కౌంటీ రీసార్ట్స్‌లో విలేకరుల సమావేశంతో పాటు జోనల్ పరిధిలోని ఏడు జిల్లాల అధ్యక్షులు, ముఖ్య నాయకులతో పార్టీ బలోపేతంపై సమావేశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి, ఇతర ముఖ్య నాయకులు హాజరవుతారని ఆయన చెప్పారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్నాటి యల్లారెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి గొర్రె శ్రీనివాసులు, పట్టణాధ్యక్షుడు సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగం పరిరక్షణకు పోరాటం



వెంకటసుబ్బయ్యను సన్మానిస్తున్న దృశ్యం

మైదుకూరు : జిల్లాలోని ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి, ఫ్యాప్టో కోశాధికారి వెంకటసుబ్బయ్య అన్నారు. ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి, ఫ్యాప్టో కోశాధికారిగా ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఉపాధ్యాయులు వెంకటసుబ్బయ్యను సన్మానించారు. ఈ సందర్భంగా వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవులు అప్పగించినందుకు ఎస్టీయూ రాష్ట్ర ఇన్‌చార్జి మల్లు రఘునాథరెడ్డి, జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, సురేష్, తోటి ఉపాధ్యాయులకు ధన్యవాదాలు తెలిపారు. విద్యారంగ పరిరక్షణకు, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా పోరాడుతానని తెలిపారు. అలానే ఇటీవల జిల్లా గణిత ఫోరానికి ఎన్నికైన ఉపాధ్యాయులు సూర్యనారాయణరెడ్డి, ఆవుల శ్రీనివాసులు, దరిశ శ్రీనివాసులును కూడా సన్మానించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, బీకే సురేష్, ఆనందరావు, మునయ్య, గోశెట్టి రామ్మోహన్ పాల్గొన్నారు.

హెల్త్ క్లినిక్, ఆర్‌బీకే కేంద్రాల ప్రారంభం

పోరుమామిళ్ల : మండలంలోని అక్కలరెడ్డిపల్లెలో శుక్రవారం ఆర్‌బీకే సెంటర్, వైఎస్సార్ హెల్త్ క్లినిక్, కొత్రపాటిపల్లెలో నూతన సచివాలయ భవనం, ఆర్‌బీకే సెంటర్, హెల్త్ క్లినిక్, కవలకుంట్లలో సచివాలయ భవనం, వైఎస్సార్ ఆరోగ్యకేంద్ర భవనాలకు రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయప్రతాప్‌రెడ్డి, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి రాష్ట్ర సలహాదారు పి.నాగార్జునరెడ్డిలతో కలసి ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి ప్రారంభించి మాట్లాడారు. పార్టీలు, కులాలు, మతాలు, వర్గాలకు అతీతంగా ప్రజలందరికీ మేలు చేసే విధంగా ముఖ్యమంత్రి పథకాలు అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమాల్లో జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వైస్ ఎంపీపీ–1 సీఎం బాషా, వైఎస్ ఎంపీపీ–2 చెన్ను రాజశేఖర్, యువ నాయకుడు ఆదిత్యారెడ్డి, సచివాలయాల కన్వీనర్ రమణారెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, ఎంపీడీఓ, తహసీల్దారు, మండల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు అగ్రిల్యాబ్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



అగ్రిల్యాబ్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న ఉద్యానవన శాఖ సలహాదారు ప్రసాద్‌రెడ్డి

బద్వేలు అర్బన్ : రైతు సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ అగ్రిల్యాబ్ సేవలను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఉద్యానవన శాఖ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక మార్కెట్‌యార్డ్ ఆవరణలోని వైఎస్సార్ అగ్రిల్యాబ్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. ఇందులో భాగంగా ఇప్పటి వరకు ల్యాబ్ ద్వారా ఏయే సేవలు ఎన్ని అందించారు అని అడిగి తెలుసుకోవడంతో పాటు రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు కల్తీ, నకిలీ ఎరువులు, విత్తనాల బారీన పడకుండా దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి నియోజకవర్గంలో రూ.65 లక్షల వ్యయంతో ఒక వైఎస్సార్ అగ్రిల్యాబ్‌ను ఏర్పాటు చేశారన్నారు. ఈ ల్యాబ్‌ల ద్వారా రైతులు పంట సాగు చేసే ముందే విత్తనాల, ఎరువుల నాణ్యత ను ఉచితంగా పరీక్ష చేయించుకోవచ్చన్నారు. బద్వేలు అగ్రిల్యాబ్ ద్వారా ఇప్పటి వరకు 1054 విత్తన నాణ్యత పరీక్షలు, 144 ఎరువుల నాణ్యత పరీక్షలు జరిగాయని...2022లో రాష్ట్రస్థాయిలో 4వ స్థానం, 2023లో 10వ స్థానంలో నిలిచిందని, ఇందుకు కృషి చేసిన సిబ్బందిని ఆయన అభినందించారు. బద్వేలు, పోరుమామిళ్ల వ్యవసాయ డివిజన్ పరిధిలోని 9 మండలాల రైతులు అగ్రిల్యాబ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజు, మార్కెట్ యార్డు సెక్రటరీ నాగిరెడ్డి, ల్యాబ్ వ్యవసాయాధికారి బి.మాధురి, పరిశోధకులు రవీంద్రరెడ్డి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

అనుడా ఆధ్వర్యంలో వెంచర్ ఏర్పాటు

నేడు బ్రోచర్లు విడుదల

ప్రొద్దుటూరు : అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో ప్రజలు ఇళ్లు నిర్మించుకునేందుకు వీలుగా ప్రత్యేకంగా లే అవుట్ తయారు చేశారు. ఆర్టీఓ ఆఫీసు పక్కన ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం 44.34 ఎకరాల విస్తీర్ణంలో వెంచర్‌ను తయారు చేశారు. ఇందులో 60 అడుగుల తారు రోడ్డు, 40 అడుగుల విస్తీర్ణంలో సిమెంటు రోడ్లను నిర్మించనున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి కుటుంబానికి ఒక ప్లాట్ మాత్రమే కేటాయించడం జరుగుతుందని సంబంధిత అధికారులు తెలిపారు. 5 సెంట్లు చొప్పున 131 ప్లాట్లు, 4 సెంట్ల విస్తీర్ణంలో 214 ప్లాట్లు, మూడు సెంట్లు ప్లాట్లు మొత్తం 484 ప్లాట్లను తయారు చేశారు. కొనుగోలుదారులు వాయిదా పద్ధతిలో ఐదు సెంట్ల స్థలానికి మొత్తం రూ.25.25 లక్షలు, 4 సెంట్ల స్థలానికి రూ.21 లక్షలు, మూడు సెంట్ల స్థలానికి రూ.15.75 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. లక్కీ డిప్ ద్వారా ప్లాట్లను కేటాయించడం జరుగుతుంది.

నేడు బ్రోచర్ విడుదల

ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వెంచర్ కు సంబంధించిన బ్రోచర్లను ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి శనివారం విడుదల చేయనున్నారు. మున్సిపల్ కార్యాలయంలో జరిగే ఈ కార్యక్రమానికి అనుడా పాలకవర్గం హాజరు కానుంది.

రెవెన్యూ గ్రామ సభలో రోడ్డు సమస్య పరిష్కారం



గ్రామసభలో స్థానికులతో మాట్లాడుతున్న ఎంపీపీ వీరనారాయణరెడ్డి

బ్రహ్మంగారిమఠం : మండలంలోని డి.నేలటూరు పంచాయతీ బూదవాడ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభలో ఆ గ్రామంలోని రోడ్డు సమస్యను పరిష్కరించినట్లు డీటీ జాన్సన్ తెలిపారు. భూ సమస్యలపై ప్రత్యేక రెవెన్యూ గ్రామ సభల్లో భాగంగా బూదవాడను ఎంపిక చేశామన్నారు. ప్రధానంగా బి.మఠం – బద్వేలు రోడ్డు నుంచి బూదవాడ గ్రామానికి చెందిన కొంత మంది రోడ్డు విషయంలో స్థల వివాదం ఉండటంతో దానిని పరిష్కరించామని డీటీ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి, సర్వేయర్ వెంకటలక్ష్మి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

కళాశాల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు ఇవ్వాలి

– ఆర్‌ఎస్‌వైఎఫ్ ధర్నా

కడప సెవెన్‌రోడ్స్ : ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా పాఠ్య పుస్తకాలు ఇవ్వాలని కోరుతూ శుక్రవారం కలెక్టరేట్ ఎదుట రాయలసీమ విద్యార్థి యువజన సంఘం ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులు ధర్నా నిర్వహించారు. ఆర్‌ఎస్‌వైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కన్నెలూరు శంకర్, జిల్లా కార్యదర్శి ఓరుగంటి నాగేంద్రబాబులు మాట్లాడుతూ కళాశాలలు ప్రారంభమై రెండు నెలలైనా పాఠ్య పుస్తకాలు లేని కారణంగా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇందువల్ల పబ్లిక్ పరీక్షల్లో ఎక్కువ శాతం ఫెయిలయ్యే ప్రమాదం ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలో 20 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, ఐదు ఎయిడెడ్ కళాశాలలు, మూడు మోడల్ స్కూళ్లు, 11 అంబేద్కర్ గురుకుల పాఠశాలలు, 17 కస్తూర్బా పాఠశాలలు ఉన్నాయన్నారు. వీటిల్లో 8051 మంది విద్యార్థులు చదువుతున్నారని పేర్కొన్నారు. అనంతరం డీఆర్వో గంగాధర్‌గౌడ్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు.

లాభాల బాటలో కోఆపరేటివ్ టౌన్ బ్యాంకు

ప్రొద్దుటూరు : లాభాల బాటలో ప్రొద్దుటూరు కోఆపరేటివ్ టౌన్ బ్యాంకు ఉన్నట్లు బ్యాంకు అధ్యక్షుడు యెల్లాల కుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం బ్యాంకు ఆవరణలో మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022–23 సంవత్సరానికి బ్యాంకు డిపాజిట్లు రూ.70 కోట్లు ఉన్నాయని, రూ.51 కోట్లు రుణాలు ఇచ్చామన్నారు. ప్రొద్దుటూరు, ఎర్రగుంట్ల, బద్వేలు, కడప బ్యాంకు బ్రాంచీలు లాభాల బాటలో నడుస్తున్నాయన్నారు. 2022–23 సంవత్సరానికి బ్యాంకు సభ్యులకు వారి షేర్ ధనంపై 9 శాతం డివిడెంట్ ఇచ్చేందుకు పాలకవర్గం నిర్ణయించిందన్నారు. బ్యాంకు ఉపాధ్యక్షులు బి.మహ్మద్ గౌస్, బ్యాంకు సీఈఓ కె.నిరంజన్ రెడ్డి పాల్గొన్నారు.

24న వేంపల్లెకు పీఠాధిపతి రాక

వేంపల్లె : పట్టణంలోని శ్రీవృషభాచలేశ్వరస్వామిని ఈనెల 24వ తేదీన హిందు ధార్మిక సేవా సంస్థ వ్యవస్థాపకులు శ్రీకాకుళం నైమిశారణ్య పీఠాధిపతి శ్రీబాలబ్రహ్మానంద సరస్వతి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని ఆలయ ఈఓ శ్రీధర్, ఆలయ చైర్మన్ కె.వెంకటేష్‌లు తెలిపారు. అనంతరం మెయిన్‌బజార్‌లో ఉన్న శ్రీఆంజనేయస్వామి ఆలయంలో సాయంత్రం 4 గంటలకు శ్రీశివ పురాణం గురించి భక్తులకు వివరిస్తారన్నారు.

దోమ కాటుపై అవగాహన

అట్లూరు : జాతీయ డెంగ్యూ నివారణ మాసోత్సవం సందర్భంగా శుక్రవారం సోమేశ్వరపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సిద్దవటం సబ్ యూనిట్ అధికారి ఇండ్ల సుబ్బరాయుడు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ మురళీకృష్ణలు దోమకాటుకు వచ్చే జ్వరాలు, డెంగ్యూపై అట్లూరు పీహెచ్‌సీ పరిధిలోని ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఏఎన్‌ఎం శ్యామలాదేవి, ఆశావర్కర్లు, పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే వెలవలికి రాక

రాజుపాళెం : మండలంలోని వెలవలి గ్రామంలో శనివారం జరగబోవు జగనన్న సురక్ష కార్యక్రమానికి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి రానున్నట్లు మండల ఇన్‌చార్జి ఎంపీపీ నారాయణరెడ్డి శుక్రవారం తెలిపారు. అనంతరం వైఎస్సార్ విగ్రహం ఏర్పాటు చేసేందుకు భూమి పరిశీలన చేయనున్నట్లు ఆయన చెప్పారు.

25న బ్రహ్మంగారిమఠానికి ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

బ్రహ్మంగారిమఠం : ప్రముఖ పుణ్య క్షేత్రమైన బ్రహ్మంగారిమఠంలోని బ్రహ్మంగారు నివాసించిన వీధిలో రూ.14లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి ఈనెల 25న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి భూమిపూజ చేయనున్నారు. బి.మఠం నాలుగు రోడ్ల కూడలిలో నిర్మించనున్న బస్ షెల్టర్ పనులను ఎమ్మెల్యే ప్రారంభించనున్నట్లు ఎంపీపీ సి.వీరనారాయణ రెడ్డి తెలిపారు. శుక్రవారం సీసీ రోడ్డు, బస్ షెల్టర్‌ను పరిశీలించినట్లు ఆయన పేర్కొన్నారు.

నేడు మెగా జాబ్ మేళా

పోరుమామిళ్ల : మాజీ సైనిక సంఘం ఆధ్వర్యంలో పోరుమామిళ్లలోని అమర్ జవాన్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయం వద్ద సెక్యూరిటీ గార్డ్ ఎంపిక శనివారం జరుగుతుందని మాజీ సైనిక సంఘం వారు తెలిపారు. హైదరాబాద్, బెంగుళూరుల్లో బ్రాండ్ జి.ఎం.ఆర్ గ్రూప్ ఆఫ్ కంపెనీల్లో సెక్యూరిటీ గార్డ్‌గా పని చేయుటకు ఆసక్తి కలిగిన వారు జాబ్‌మేళాలో పాల్గొనవచ్చునన్నారు. వివరాలకు 8328619287, 9573043507, 8185035610 నెంబర్లకు ఫోన్ చేయాలన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా రామిరెడ్డి

పోరుమామిళ్ల : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా శుక్రవారం కల్లూరి రామిరెడ్డి విధుల్లో చేరారు. రాజంపేట జూనియర్ కళాశాల నుండి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న జయసుబ్బారెడ్డి జమ్మలమడుగుకు బదిలీ అయ్యారు.

వృద్ధాశ్రమంలో సేవా కార్యక్రమం

కాశినాయన : మండలంలోని ఓబులాపురం–సగిలేరు ఒడ్డున వివేకానంద ఆశ్రమం, గొంటువారిపల్లె నీలకంఠేశ్వరస్వామి వృద్ధాశ్రమం, అమగంపల్లెలోని బాలమ్మ సత్రంలోని 140 మంది వృద్ధులకు పోరుమామిళ్లలోని ఫౌండేషన్ ఫర్‌నీడ్ ఇన్ చిల్డ్రన్స్ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ గీతా థామస్‌రెడ్డి దంపతుల సహకారంతో వారి ప్రతినిధి ప్రసాద్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి లు శుక్రవారం ఉచితంగా దుప్పట్లు పంపిణీ చేశారు.

జేవీకే బయోమెట్రిక్ తప్పనిసరి



బయోమెట్రిక్ వేయిస్తున్న సీఎంఓ కొండా దశరథరామిరెడ్డి

బ్రహ్మంగారిమఠం : సచివాలయ, విద్యాశాఖ ఉద్యోగులు సమన్వయంతో 100 శాతం జగనన్న విద్యా కానుక – 4 బయోమెట్రిక్ వేయించాలని జిల్లా సమగ్ర శిక్ష పథకం సీఎంఓ కొండా దశరథరామిరెడ్డి తెలిపారు. శుక్రవారం బ్రహ్మంగారిమఠంలోని బాలికల ఉన్నత పాఠశాల, కొత్తపల్లె, పాపిరెడ్డిపల్లె ఎంపీపీ పాఠశాలలను సందర్శించి విద్యార్థులచే బయోమెట్రిక్ వేయించారు. అనంతరం ఆయన ఎమ్మార్సీని తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ పుల్లయ్య, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రవీణ్‌కుమార్, కొండారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు సహకరించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌ఐ శ్రీనివాసులు

దువ్వూరు : మండల కేంద్రమైన దువ్వూరు పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం వివిధ వర్గాలకు చెందిన వారితో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ శ్రీనివాసులు మాట్లాడుతూ శాంతి భద్రతలను కాపాడటంలో ప్రజలు పోలీసులకు సహకరించాలని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా పోలీసులకు తెలపాలన్నారు. ఎలాంటి సమస్యలు వచ్చినా పెద్దలు పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

25న అభ్యుదయ సాహిత్య ఉపన్యాసం

కడప కల్చరల్ : స్థానిక సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఈనెల 25న ఉదయం 10 గంటలకు అభ్యుదయ సాహిత్య ఉపన్యాసం నిర్వహించనున్నామని వైవీయూ సభ్య కార్యదర్శి, కుల సచివులు ఆచార్య వైపీ వెంకటసుబ్బయ్య తెలిపారు. ఈ కార్యక్రమానికి పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎస్.ఈశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. ప్రముఖ బాల సాహిత్య రచయిత డీకే చదువులబాబు విశిష్ఠ అతిథిగా, కథా రచయిత పాలగిరి విశ్వప్రసాద్ గౌరవ అతిథిగా హాజరు కానున్నట్లు వివరించారు. ద్రవిడ విశ్వ విద్యాలయం తెలుగు, అనువాద అధ్యయనాల విభాగం అధ్యక్షులు ఆచార్య కిన్నెర శ్రీదేవి ప్రధాన వక్తగా వ్యవహరిస్తారన్నారు.